సామాన్యుడి సంక్షేమమే జగనన్న లక్ష్యం

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల: సామాన్య ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ వారిని వృద్ధిలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమరెడ్డి అన్నారు. మంగళవారం చేజర్ల మండలం పాడేరు సచివాలయ పరిధిలోని చీర్లవారికండ్రిక, బొగ్గలవారికండ్రిక, తిమ్మాయపాళెం, పాడేరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చీర్లవారికండ్రికలో ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామానికి వచ్చేందుకు ఉన్న మట్టి రోడ్డు కూడా గుంతల మయంగా ఉండడంతో ప్రయాణం చేయాలంటే అవస్థలు పడుతున్నామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వీలైనంత త్వరగా రోడ్డు సమస్యను పరిష్కరిస్తానన్నారు. చేజర్ల మండలం బొగ్గలవారికండ్రికలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్తున్నప్పుడు మార్గమధ్యంలో దాసరి వెంకటకృష్ణయ్య అనే దివ్యాంగుడు కనిపించగానే తన వాహనాన్ని వెంటనే నిలిపి ఆయన సమస్య అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగి కాలు విరిగి పోయిందని ఎలక్ట్రిక్ వాహనం మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా వివరాలు నమోదు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రిక్ వాహనం మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ పరిధిలో రూ.12 కోట్ల విలువైన సంక్షేమం, అభివృద్ధి పనులు చేసామన్నారు. ఇంకా రూ.3 కోట్ల పనులు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆత్మకూరు నియోజక వర్గానికి సుమారు రూ.15 వందల కోట్ల మేర నిధులు అభివృద్ధి, సంక్షేమం కోసం మంజూరు చేసారన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షమ పథకాలు అందిస్తూ వారి ఇంటిలో ఒకరిగా ముఖ్యమంత్రి నిలుస్తున్నారని వివరించారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఆసరా, నేతన్ననేస్తం ఇలాంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. ఇవేకాక సచివాలయాల నిర్మాణం, ఆర్‌బీకే సెంటర్ల నిర్మాణం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను చేపట్టాడన్నారు. గ్రామాలకు అవసరమైన అన్ని వసతులు ఒకేచోట కల్పించి ప్రజలకు ఉపయోగపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి మండల సొసైటీ అధ్యక్షుడు బూదళ్ల వీరరాఘవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి వైస్ ఎంపీపీ తిరుపతి నాయుడు, నాయకులు గోనుగుంట రాంబాబు, శేఖరరెడ్డి, రవీంద్రనాయుడు, ఎర్రగుంట పెంచలయ్య, మోడేపల్లి పెంచల నాయుడు, ఉడతా హాజరత్తయ్య, ఉడతా రత్నయ్య, బొరిగెర్ల వెంకటేశ్వర్లు, పాడేరు సర్పంచ్ గుమ్మా వెంకటేవ్వర్లు, ఎంపీటీసీ జి.ప్రభావతి, వీఆర్వో కాలువ లక్ష్మీనరసింహప్రసాద్, పొంకు నాగేశ్వరరావు, సానా శీనయ్య, సచివాలయ కన్వీనర్ వి.వెంగళ‌రెడ్డి

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కలెక్టర్ హరినారాయణన్‌ను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు

సంగం: గృహ నిర్మాణాలను వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గోపీ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కరిముల్లా, పొదుపు ఏపీఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు ప్రారంభించాలి

ఉదయగిరి: మండలంలోని జగనన్న కాలనీల్లో పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఏఈ రామకృష్ణారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్ష పాల్గొన్నారు.

డీఎల్‌డీఓ ఆకస్మిక తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న కనకదుర్గాభవాని

అల్లూరు: మండలంలోని అల్లూరు 1, 2, 3 సచివాలయాలను కావలి డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయ సిబ్బంది హాజరు పట్టిని, ప్రజలకు అందిస్తున్న సేవల రికార్డులను తనిఖీ చేశారు. ఆధార్ అప్‌డేట్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఎలా జరుగుతుందని ఆరా తీశారు. కమిషనర్ ఫణికుమార్, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక సూపర్‌వైజరు ఆత్మహత్యాయత్నం

ఉదయగిరి: సీతారామపురం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న బి.నిఖిత సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో బంధువులు ఆమెను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నిఖితను ఐసీడీఎస్ అధికారులు ఇటీవల సీతారామపురం తాత్కాలిక సూపర్‌వైజరుగా నియమించారు. ఆమె విధులు కొనసాగిస్తున్న నేపథ్యంలో అదే మండలానికి చెందిన మరో అంగన్‌వాడీ సూపర్‌వైజరు వరికుంటపాడు మండలంలో విధులు నిర్వర్తిస్తోంది. ఆమె తిరిగి సొంత మండలానికి సూపర్‌వైజరుగా రావాలనే కోరికతో తనను ఆమె తరపు బంధువులు వేధిస్తున్నారని ఆత్మహత్యా యత్నానికి ముందు పోలీసులకు లేఖ రాసింది.

రూ.2.15 కోట్లతో మినీ స్ప్రింక్లర్లు



కావలి: కావలి నియోజకవర్గంలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.15 కోట్లు విలువ చేసే మినీ స్ప్రింక్లర్లను మంజూరు చేసిందని, వాటిలో రూ.1.75 కోట్లు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని కావలి వ్యసాయ సహాయ సంచాలకు కె.కన్నయ్య మంగళవారం చెప్పారు. నియోజకవర్గంలోని 240 మినీ స్ప్రింక్లర్లను 195.51 హెక్టార్లలో పంటలు సాగు చేయడానికి మంజూరు చేసినట్లు వివరించారు. వీటి ద్వారా నీటి పంపిణీ ఎల్లప్పుడూ సజావుగా సాగుతుందన్నారు. జిల్లా మైక్రోఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసులు మంగళవారం కావలి నియోజకవర్గంలోని స్ప్రింక్లర్ల వినియోగాన్ని పరిశీలించారు.

లోకోస్ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలి


మండల సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పిస్తున్న పీడీ

కావలి రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన లోకోస్ యాప్‌పై మహిళా సమాఖ్య సంఘ సభ్యులు ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీ సాంబశివరెడ్డి తెలిపారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం పరిశీలించి సలహాలు, సూచనలందించారు. ఆయన మాట్లాడుతూ మహిళ సంఘాల సమాఖ్యలో ఆర్థిక లావాదేవీలు, సమావేశాలు, నిర్వహణ, మొదలగువన్నీ దేశం మొత్తంలో ఒకే విధంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం ఈ లోకోస్ యాప్‌ను ఆవిష్కరించిందన్నారు. గతంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా మహిళా సంఘాల సమాఖ్యలు, ఆర్థిక లావాదేవీలు, నిర్వహణ, సమావేశాలు ఉండేవన్నారు. డేటా ఎంట్రీ చేసేప్పుడు గ్రామ స్థాయిలో అందరూ ఉండేలా మే 15 నుంచి జూన్ 15వ తేదీ వరకు ప్రతి వీఓఏలు రోజుకు రెండు సంఘాల చొప్పున డేటా ఎంట్రీ చేయాలన్నారు. ప్రస్తుతం మండలానికి ఐదుగురు చొప్పున శిక్షణ ఇస్తున్నామని, వారు మండలంలోని మిగిలిన సిబ్బందికి శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ మధుసూదన్, ట్రైనింగ్ రీసోర్స్ పర్సన్స్ ఏపీఎం కాంతారావు, చిన్నయ్య, వెలుగు సీసీ మోహన్‌రావు, కొవ్వూరు సీసీ హరి, కొడవలూరు వీఓఏలు మస్తానమ్మ, వెంకటరమణమ్మ, అన్నీ మండలాల ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

డ్వామా ఏపీడీ విస్తృత తనిఖీలు



ఆత్మకూరురూరల్: మర్రిపాడు, ఆత్మకూరు మండలాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం డ్వామా ఏపీడీ నిర్మలాదేవి తనిఖీలు చేశారు. అల్లంపాడులో నిర్మాణంలో ఉన్న చెక్‌డ్యామ్ నిర్మాణ పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆత్మకూరు మండలం రావులకొల్లులో వైఎస్సార్ జలకళ బోర్ల ఏర్పాటుపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి రైతులతో మాట్లాడారు. పూర్తిస్థాయిలో సద్వినియోగం అయ్యేలా ప్రభుత్వ సహకారం అందిస్తుందని వారికి తెలిపారు. కార్యక్రమంలో మర్రిపాడు, ఆత్మకూరు ఉపాధి హామీ పథకం ఏపీఓలు సునీల్, శిరీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతుల ప్రయోజనాల కోసమే సొసైటీ


ఆత్మకూరు ఫార్మర్స్ సొసైటీలో సిబ్బందితో మాట్లాడుతున్న సుధాభారతి

ఆత్మకూరు: పట్టణంలోని సిండికేట్ ఫార్మర్స్ కో ఆపరేటివ్ సొసైటీ రైతుల ప్రయోజనాల కోసం విశేష కృషి చేస్తుందని, కోట్లాది రూపాయల వ్యవసాయ రుణాలు అందజేసిందని జిల్లా కో ఆపరేటివ్ సొసైటీల అధికారిణి సుధాభారతి అన్నారు. పట్టణంలోని సిండికేట్ ఫార్మర్స్ సొసైటీని ఆమె మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సొసైటీ సిబ్బంది పనితీరు, రుణాల మంజూరు, సరుకుల నిల్వ రికార్డులతో సరిపోల్చుకున్నారు. అనంతరం ఆమె సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, మేనేజరు ఎస్.శ్రీనివాసన్, సిబ్బందితో మాట్లాడారు. 2022–23 సంవత్సరానికి రైతులకు రూ.2.95 కోట్ల వ్యవసాయ రుణాలు, వ్యవసాయేతర మధ్య కాలిక రుణాలు రూ.2 కోట్లు, బంగారు ఆభరణాలపై రూ.2.20 కోట్లు, ఇతర రుణాలు రూ.0.50 కోట్లు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికి రూ.2.80 కోట్లు వ్యాపారం సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ ద్వారా జరిగినట్లు ఆమె తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయడంతో పాటు రైతుల అవసరాల కోసం ఇతరేతర రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత ఏడాది ధాన్యం కొనుగోలుకు సంబంధించి లావాదేవీల నగదు గురించి సొసైటీ అధ్యక్షుడు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. రైతుల అవసరాల కోసం సరిపడా ఎరువులు సరఫరా చేయడంతో పాటు గోడౌన్ మహిమలూరులో నిర్మించేందుకు అనుమతి మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి సుధాకర్, మల్లికార్జున, ఫాతిమా బేగం పాల్గొన్నారు.

వక్ఫ్ భూములు పరిశీలించిన డైరెక్టర్


భూములు పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు బృందం

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రం పంచాయతీ మసీదుపల్లిలో ఉన్న వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన మసీదు భూములను మంగళవారం జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్దాని, వక్ఫ్‌బోర్డు వైస్ ప్రెసిడెంట్ షౌకత్‌అలి పరిశీలించారు. ఈ సందర్భంగా మసీదుకు చెందిన వందల ఎకరాల భూములను సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. భూములకు సంబంధించిన నివేదికను రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు సమర్పించి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. షేక్ సందాని, షాజహాన్, దస్తగిరి, మునీర్, ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్ తదితరులున్నారు.

కూలీల హాజరు పెంచాలి

• డ్వామా పీడీ వెంకటరావు


కలిగిరిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకట

కలిగిరి: ఉపాధి హామీ పథకం పనుల్లో ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ వెంకటరావు తెలిపారు. కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో కలిగిరి, కొండాపురం, వింజమూరు, జలదంకి మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. కూలీలకు కనీస వేతనం రోజుకు రూ. 272 వచ్చేలా చూడాలన్నారు. వేసవిలో పనుల వద్ద కూలీలు ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనుల విషయంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. కలిగిరిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓలు, టీఏలు, ఏఫ్ఏలు, క్షేత్ర సహాయకులు, సీనియర్ మేట్‌లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి స్థలం కేటాయింపు


అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న వివిధ శాఖల మండల స్థాయి అధికారులు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు పంచాయతీ రామాపురంలో అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మాణానికి వివిధ శాఖల అధికారులు మంగళవారం స్థలం సర్వే చేసి కేటాయించారు. గతంలో పలు కారణాలతో ఈ భవన నిర్మాణానికి స్థానికులు అంగీకరించకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో తహసీల్దారు లక్ష్మీ నరసింహం, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ నజీర్‌బాషా, ఆర్ఐ పృధ్వీ, వీఆర్ఓ ప్రతాప్, తదితరులు కరటంపాడు గ్రామ సర్వే నంబరు 161లో 5 సెంట్ల స్థలాన్ని భవన నిర్మాణానికి కేటాయించారు. త్వరలోనే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రూ.20 లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ జైనకుమారి, సూపర్‌వైజర్ నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



నిందితుడి తరలింపు అడ్డగింత

బిట్రగుంట: నేరారోపణల నేపథ్యంలో బోగోలు మండలంలోని కప్పరాళ్లతిప్ప గ్రామానికి చెందిన పీట్ల మహేష్‌ను అదుపులోకి తీసుకునేందుకు వచ్చిన నెల్లూరు పోలీసులను అతని కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఈ ఘటన మంగళవారం బోగోలు చేపల మార్కెట్ వద్ద జరిగింది. మహేష్ ను అదుపులోకి తీసుకునేందుకు చేసిన ప్రయత్నంలో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. చివరికి పోలీసులు మహేష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం నెల్లూరుకు తరలించారు.



